# ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక

Bullet Edition

ఆదివారం, 4 ఆగస్టు 2024 www.prajaaswaramdaily.com 2PM




# గ్రాండ్ వెల్‌కం..

## న్యూయార్క్ చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డి

## ఘనంగా స్వాగతం పలికిన ప్రవాస భారతీయులు

హైదరాబాద్, ఆగస్టు 4 (ప్రజాస్వరం) : తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు వెళ్లారు. శనివారం ప్రారంభమైన ఆయన ప్రయాణం ఆదివారం తెల్లవారుజామున అమెరికా చేరుకున్నారు. న్యూయార్క్ ఎయిర్ పోర్టులో ముఖ్యమంత్రి బృందానికి ఘన స్వాగతం లభించింది. సీఎం రేవంత్ రెడ్డి 10 రోజుల పాటు అమెరికాలో పర్యటించనున్నారు. ఈరోజు న్యూయార్క్ లో ఎన్ ఆర్ ఐలతో రేవంత్ భేటీ కానున్నారు. ఇక్కడి పర్యటన అనంతరం రేవంత్ బృందం దక్షిణ కొరియాకు వెళ్లనుంది. తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడమే లక్ష్యంగా సీఎం రేవంత్ విదేశీ పర్యటన షెడ్యూల్ కొనసాగుతుందని ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. న్యూజెర్సీ, వాషింగ్టన్ డీసీ, న్యూయార్క్, శాన్ ఫ్రాన్సిస్కో, దక్షిణ కొరియాలోని సియోల్ లలో రేవంత్ బృందం పర్యటించనుంది. ఇవాల్టి నుంచి సుమారు 10 రోజులు విదేశీ పర్యటలో సీఎం రేవంత్ రెడ్డి బిజీ బిజీగా ఉండనున్నారు.

**పెట్టుబడుల సాధనే లక్ష్యం..**

అమెరికా నుంచి సీఎం సందేశం ఇస్తూ.. 'కీలకమైన న్యూయార్క్ నగరం నుంచే పెట్టుబడుల సాధన పర్యటన ప్రారంభించడం సముచితంగా భావిస్తున్నాను. ప్రవాస భారతీయులైన ఇక్కడి మన తెలుగు సోదర సోదరీమణులు గుండెల నిండా ప్రేమ, ఆప్యాయతలతో మాకు స్వాగతం పలకడానికి విచ్చేశారు. మనందరినీ ఏకం చేసే ఒక కల.. తెలంగాణను మరింత గొప్పగా అభివృద్ధి చేసుకోవడం' అని ముఖ్యమంత్రి తన సందేశంలో పేర్కొన్నారు.

# ఆల్ ది బెస్ట్ రేవంత్ రెడ్డి..

-కేటీఆర్ ట్వీట్-



KTR
@KTRBRS · Follow

As a large contingent from the Telangana Government travels to the US and South Korea to attract investments, I want to take a moment to wish @revanth_anumula and @Min_Sridhar_Babu gaaru - "All the Best"

I came across the schedule reported by some media outlets and I'm pleased... Show more

12:04 PM · Aug 4, 2024

**హైదరాబాద్, ఆగస్టు 4 (ప్రజాస్వరం) : తెలంగాణకు పెట్టుబడులు తెచ్చేందుకు అమెరికా, దక్షిణ కొరియా పర్యటనకు వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబుకు బెస్ట్ విషెస్ చెప్పారు బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి కేటీఆర్. వారికి ఆల్ ది బెస్ట్ చెబుతూ ట్వీట్ చేశారు. ఈసారి పర్యటనలో తెలంగాణకు పెట్టుబడులతో రావాలని అన్నారు. కేసీఆర్ హయంలో గత 10 ఏళ్లలో రాష్ట్రానికి 4 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయని పేర్కొన్నారు. ప్రైవేట్ రంగాల్లో 24 లక్షల ఉద్యోగాలు సృష్టించామని చెప్పారు.**



# 800 కేజీల గంజాయి స్వాధీనం

## ఒడిశా టూ మహారాష్ట్ర వయా తెలంగాణ..!

హైదరాబాద్, ఆగస్టు 4 (ప్రజాస్వరం) : హైదరాబాద్ లో భారీ స్థాయిలో గంజాయి పట్టుబడింది. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఎస్వోటీ (స్పెషల్ ఆపరేషన్ టీమ్) పోలీసులు ఈ గంజాయిని గుర్తించారు. దాదాపు 800 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. బాలానగర్ ఎస్వోటీ, శంషాబాద్ పోలీసులు కలిసి ఈ జాయింట్ ఆపరేషన్ నిర్వహించారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.2.94 కోట్ల విలువ ఉంటుందని పోలీసులు చెప్పారు. 800 కేజీల గంజాయి కంటెయినర్ లో ఓ వాహనం ఒడిశా నుంచి మహారాష్ట్రకు హైదరాబాద్ మీదుగా వెళ్తున్నట్లుగా విచారణలో పోలీసులు గుర్తించారు. ఈ స్థాయిలో గంజాయి తరలిస్తూ పట్టుబడటం ఇదే తొలిసారని పోలీసులు తెలిపారు. ఈ వ్యవహారంలో ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. డీసీఎం డ్రైవర్ లు సంజీవ్ విఠల్ రెడ్డి, హోల్లప్ప, సప్లయర్ సునీల్ ఖోస్లా, జాగ సునాలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ దందాకు మూలకారకులైన వారి గురించి పోలీసులు ఆరా తీస్తున్నారు. అరకుకు చెందిన వ్యక్తి గంజాయి సరఫరాదారుగా ఉన్నాడని, అతని పేరు రాము అని తెలిపారు. అతను ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు పోలీసులు చెప్పారు. ఇతను చాలా పెద్ద మొత్తంలో గంజాయిని ఇతర రాష్ట్రాలకు సరఫరా చేస్తుంటాడని పోలీసులు చెప్పారు. కమీషన్ ఎజెంట్ కం ట్రాన్స్‌పోర్టర్ గా ఒడిశాకి చెందిన సోమ్ నాథ్ ఖారా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. రాము అనే వ్యక్తి గతంలో గంజాయి రవాణా చేస్తూ అరెస్ట్ అయ్యాడు. మెయిన్ పెడ్లర్ కం రిసీవర్ సురేష్ మారుతి పాటిల్ కూడా పరారీలో ఉన్నాడు.

## లోన్ ఇస్తామంటూ ఇంటికి వచ్చి..

# బంగారు గొలుసుతో పరారీ



మేడ్చల్, ఆగస్టు 4 (ప్రజాస్వరం) : లోన్ ఇస్తామంటూ ఇంటికి వచ్చిన గుర్తుతెలియని దుండగుడు వృద్ధురాలు మెడలో నుంచి గొలుసు లాక్కెళ్ళిన సంఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం మేడ్చల్ మండలంలోని డబిల్ పూర్ గ్రామంలో చుక్కమ్మ అనే వృద్ధురాలు ఇంటికి గుర్తుతెలియని దుండగుడు ఆదివారం ఉదయం 10 గంటల సమయంలో లోన్ ఇస్తామంటూ ఇంటికి వచ్చాడు. ఇంట్లో ఎవరు లేని సమయం గమనించి వృద్ధురాలు మెడలో ఉన్న మూడు తులాల బంగారు గొలుసు లాక్కుని తన వచ్చిన ద్విచక్ర వాహనంపై పారిపోయాడని బాధితురాలు మేడ్చల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మేడ్చల్ పోలీసులు తెలిపారు.

# శ్రీశైలం వెళ్తుండగా ప్రమాదం.. ముగ్గురు మృతి

నాగర్ కర్నూల్, ఆగస్టు 4 (ప్రజాస్వరం) : జిల్లాలో శనివారం అర్ధరాత్రి ఘోర ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో ముగ్గురు స్పాట్‌లోనే ప్రాణాలు కోల్పోగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ జిల్లా మత్స్యబొల్లారానికి చెందిన మాచర్ల కిషన్ కన్నయ్య (22) తన ముగ్గురు స్నేహితులతో కలిసి శనివారం రాత్రి కారులో శ్రీశైలం జలాశయం సందర్శనకు వెళ్లారు. ఈ క్రమంలో నాగర్ కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం వటవర్లపల్లి సమీపంలో వీరు ప్రయాణిస్తున్న వాహనం అదుపు తప్పి ఓ చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు క్షతగాత్రున్ని సమీపంలోని నంద్యాల జిల్లా సున్నిపెంట ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అచ్చంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుల్లో ఒకరిని కిషన్ కన్నయ్యగా గుర్తించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


